# దక్షారామం

అజంతా రేఖ, ఎల్లోరా శిల్పం, కళ్ళతో పట్టుకుని, కుంచెతో ఆడించగలవాడు సుబ్బరాయశర్మ!

ఎక్కడెక్కడో తిరిగాడు, ఏవేవో గీశాడు. రాణించలేదు. మండపేట వచ్చాడు. కళాభిమానుల్ని పలకరించాడు. శ్రీమంతుల్ని ఆశ్రయించాడు. కళ్లు నిండుతున్నాయి, చెయ్యి నిండడంలేదు. కుంచె నేలకేసి కొట్టాడు.

నవ్వుతూ 'శ్రీరామ్' కుంచెతీసి చేతిలోపెట్టి నడవమన్నాడు.

రామచంద్రపురం వచ్చాడు.

పరిచయమయింది. ఇద్దరం కలల వాళ్ళమే. ఇంక లోటేమిటి? డబ్బుకు గాని—

మల్లె మొక్కల దగ్గర—అరటి బోదులమధ్య— సమృద్ధిగా కలలు కనవచ్చు.

కళాభారతి-చిత్ర శిక్షణశాల—

కవితాగోష్ఠులు—సాహిత్య సంసత్తులు-

గ్రంథ ప్రచురణ సంస్థ—

"ఉత్తమాటలు నీవి పొమ్మందిరా— ఎంకి కొత్తపాటలు పాడు కొమ్మందిరా-"

రాత్రి తొమ్మిదింటికి ఆకలి జ్ఞాపకంచేస్తే ఇళ్ళకి వెళ్ళేవాళ్ళం—

ఇది పూర్వపీఠిక—

అవ్వాలి కథాక్రమం బెట్టిదనిన—

టక్కున జట్కావచ్చి గుమ్మంలో ఆగింది. అప్పుడు రిక్షాలు లేవు. 1948 మాట - జట్కాలోంచి శర్మ దిగాడు. బట్టలేసుకుని బయలుదేర మన్నాడు. ఎక్కడికి ? దాక్షారం—

"సంతకా ?" నవ్వుతూ అన్నాను.

"సంత రేపు-మరిచిపోయారు. ఇంకో మంతనానికి" అన్నాడు శర్మ.

బండిలో చిత్ర పరికరాలు డ్రాయింగ్ పేపరు_పడగ విప్పని పాముల్లా ఉన్నాయి.

పగలు పన్నెండు గంటలకు దాక్షారం చేరాం.

దక్షిణ గోపురం దగ్గర బండి ఆగింది.

ఎడంచేతివైపు బ్రహ్మాండమైన సత్రం. కుడిచేతివైపు సప్తగోదావరి మెట్లు-చిన్న చిన్నగుళ్ళు. నన్నే చూడమన్నట్టు ఎత్తయిన గోపురం! అప్పుడు-దేవాలయాలంటే_ద్వేషంలేదుగాని_ఆసక్తిలేదు. బ్రహ్మ సమాజం వాసన ఇంకా మనస్సుని పట్టుకు వదలలేదు.

ఈ అభిషేకాలు, భక్తులు, దొంగ దండాలు; చిరాకు - ఎలర్జీ- ఆ గోపురం చూస్తే - ఆశ్చర్యంతో - ఆలోచనతో - మనస్సు నిండి పోయింది.

చిక్కగా కట్టిన ఆ రాతి ప్రాకారంలో_ తలఎత్తి చూస్తే పాగా జారిపోయేటంత ఎత్తు గోపురంలో - ఏదో ప్రాచీన సుగంధం - రెడ్డి రాజుల, చాళుక్య నృపతుల ఆత్మలు యింకా - వదలలేక ప్రదక్షిణం చేస్తూన్నట్టే అనిపిస్తుంది!

ఎంత దీక్షతో - తపనతో - మనస్సును ఊగించే తాత్పర్యంతో - ఎంతలేసి రాతిపలకలు, బండరాళ్ళు ఏనుగులచేత మోయించి తెచ్చారో ఈ మండపాలు కట్టడానికి - ఏదో ఆత్మను నిలువునా ఊపెయ్యాలి _ ఇంత పని చెయ్యడానికి - అది మతం అనండి _ మమత అనండి - మంటిగడ్డ అనండి-

ముఖం వేలాడేసుకువచ్చిన వ్యాసుడు, కస్తూరి పరిమళంతో గుమ గుమలాడే శ్రీనాథుడు, రత్న కిరీటంతో చాళుక్య భీముడు, తురాయి పట్టు పాగాతో వేమారెడ్డి, నీటిబొమ్మల్లా మనస్సులో కదుల్తున్నారు.

గతంలోంచి ప్రస్తుతంలోకి లాగి శర్మ సత్రం హాలులోకి నడిపించాడు.

ఎండ చల్లపడింది. డ్రాయింగ్ పేపరు, పెన్సిలు తీసుకుని శర్మ బయలుదేరాడు.. నేను అనుసరించాను. 'సన్మనుష్య మనోయథా' అని వాల్మీకి అన్నట్టు ఆ ప్రాంగణం హాయిగా, విశాలంగా వుంది.

డెభ్భై స్తంభాల మండపం ఎదురుగా నాగలింగం పూలచెట్టు.

పువ్వు చిక్కగా గట్టిగా ఉంటుంది. శర్మ ఆప్యాయంగా ఒక పువ్వు తీశాడు. రేఖలమధ్య పడగ విప్పుకున్నట్టు కేసరాలు. ఆ పడగ కింద చిన్న లింగం వంటి ఆకృతి . ఓహో ! ప్రకృతే శివమయమా !

ఈ పాము పడగకింద శివలింగం ఎవరు కూర్చారు ? నా బ్రహ్మ సమాజం పొడిపొడిగా రాలిపోతోంది. పువ్వు అందానికా ? ఆ శివ స్వరూపానికా ? శర్మ 70 స్తంభాల మండపంలోకి నడిచాడు. స్తంభాలమీదవున్న డిజైన్లకు ముగ్ధుడై డ్రాయింగు పేపరు తీసి చకచక నకలు గీస్తున్నాడు-అల్లుకున్న తీగలు- పువ్వులతో కాయలు- ఆకుజొంపాలలో ఏనుగు తలలు- ఒక నగిషీలోనుంచి పైకిలేచిన సింహం ముఖం. దాన్ని కప్పివేసే జూలు- కౌగితం నిండిపోయింది.

దక్షిణద్వారం దగ్గర దేవతల సభ దగ్గరికి వెళ్ళాం. ఆ సభ

మండపం కప్పుమీద-కళ్ళు తిరిగిపోయే శిల్పం- తల ఎత్తుకునే చూడాలి. ఒక పద్మలాకారంలో ఇంద్రాది దేవతలందరూ—

బొమ్మ గీయలేదు.

సూర్యద్వారం దగ్గరనుంచి కల్యాణ మండపంలోకి వస్తూవుంటే- మధ్యను నిగనిగలాడే నీలశిలలో నంది, చెయ్యివేస్తే కొమ్ములు చిమ్మి ఎగసి పడేలా వుంది.

దాటి కల్యాణమండపం దగ్గరకి వచ్చాం.

శర్మ ఆగిపోయి చూస్తున్నాడు. ఒక స్తంభం దగ్గర నిలిచి- ఇద్దరు స్త్రీలు, నృత్యభంగిమలో చేతులు కలిపి ఒక వలయంగా ఏర్పడ్డారు. దూరానికి చూస్తే ఒక చక్రంలా కనపడుతుంది.

చక్కని నకలు గీశాడు.

సంధ్యాకాలం అయింది. మాణిక్యాంబ గుళ్ళో కుంకుమ పూజ. పూజదగ్గర - అందమైన పడుచులు పూలతో, పండ్లతో నిలుచున్నారు.

మాణిక్యగౌరి సౌందర్యలహరి- ఆమె విలాసంగా తన సౌందర్యం వొంటినుంచి మంచిగంధంలా వూర్చి అయిదు వేళ్ళతోనూ చిమ్మితే - ఈ ఆడపిల్లలు పుట్టారేమో - అనిపించింది.

హరహర మహాదేవ-పై అంతస్తులో భీమేశ్వరుడికి సంధ్యాపూజ. గణగణ గంటలు-తెలుంగుదేశపు త్రిలింగాలలో తూర్పు సరిహద్దు ఈ భీమేశ్వరలింగం. పీఠంమీద తొమ్మిది అడుగుల ఎత్తు, పూజలు అభిషేకాలు పై అంతస్థులో జరుగుతాయి.

దీపాలు వెలిగించారు. నిగనిగలాడే నల్లరాతి స్తంభాల్లో దీపాలు ప్రతి ఫలిస్తే వదిలిపోలేని శివభక్తుల ప్రాణాల్లా వున్నాయి!

గుళ్లోకి వెళ్ళలేదు. ఎక్కడలేడు శివుడు ? శర్మ యావత్తు దేవాలయం స్కెచ్ గీసి తృప్తిగా చూస్తున్నాడు మండపం దగ్గర—

తిరిగి వస్తూ - దక్షిణ గోపురంవైపు తోవలో జలజల పూలురాలే పొగడ చెట్టుదగ్గర ఆగి - ఆలయశిఖరంవైపు తిరిగి చూశాను. విడిచి వెళ్ళాలని లేదు.

ఏదో ఓదార్పుతో - ఉత్తేజంతో మనస్సు నిండిపోయి గొంతులో పద్యం కదిలింది !

"ఇక్కడ కాలువెట్టగ అదేమి మహత్త్వము గాని, ఊహకున్
రెక్కలు వచ్చినట్టు, చననేరని
పూర్వ యుగాల త్రోవలుదున్."

గోపురం దగ్గర బండెక్కాం. బండి ప్రాకారం పక్కగా వెడుతోంది.

"ఉన్నావో మరి లేనెలేవొ ఇట ఓహో భీమనాథ ప్రభూ
కన్నానించిన యంత ఆలయపు స్వర్గ ప్రాయ గంభీర శాం
త్యౌన్నత్యంబులు దివ్యశోభ లిట ఊహన్ రేపు..."

మనస్సులో పద్యం రూపు దిద్దుకుంటోంది. అది 200 పద్యాల దక్షారామ కావ్యానికి బీజం అయింది.

●